క్లుప్తంగా

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి


సుంకర సీతారామ్

పెనుగొండ: అధికారం దక్కదనే అక్కసుతో నైతిక విలువలకు తిలోదకాలిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఆచంట మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.సీఎం జగన్ ప్రజారంజక పాలనను ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేని పచ్చ మీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేస్తున్న అభివృద్ధి పనులతో ఆచంటలో విజయం ఖాయమన్నారు.

కేదారీ ఘాట్ ప్రక్షాళన


సిద్ధాంతం కేదారీ ఘాట్ శ్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలోని సుప్రసిద్ధకేదారీ ఘాట్ శ్మశాన వాటిక దాత సహకారంతో ఆదివారం ప్రక్షాళన చేశారు. చెత్తా చెదారాలతో నిండిపోవడంతో ఇటీవల దహన క్రియలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం దక్షిణ కాశీగా పేరు గాంచిన వశిష్టా తీరంలో కేదారీ ఘాట్‌లో దహన సంస్కారాలు చేస్తుంటారు. దీంతో సిద్ధాంతం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మండవల్లి హరిప్రసాద్ సహకారంతో ఆదివారం చెత్తా చెదారాలు తొలగించి ప్రక్షాళన చేశారు. దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా శుభ్రపరిచారు. కార్యక్రమంలో కొరు వెంకటేశ్వర్లు, ఊటాల వెంకటేశ్వర్లు, ఊటాల వెంకన్న, కర్రి రాంబాబు, గెద్దన పల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేఎంఏ జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మాజీ


ఘంటశాల బ్రహ్మాజీ

నరసాపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఏపీజేఎంఏ)జిల్లా అధ్యక్షుడుగా నరసాపురం శ్రీ సూర్య విద్యాసంస్థల అధినేత ఘంటశాల బ్రహ్మాజీ ఎన్నికయ్యారు. తణుకులో జరిగిన సంఘ సమావేశంలో బ్రహ్మాజీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వీఎస్ఎస్ స్వామి మరో 14 మందితో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం కూడా అమ్మ ఒడి లాంటి పథకాలను ప్రైవేట్ కళాశాలలకు అందించి ప్రోత్సహిస్తోందని చెప్పారు.

కేశవస్వామికి సామూహిక పూజలు


కొఠాలపర్రులో కేశవ స్వామికి దివ్య ప్రబంధ పారాయణ చేస్తున్న వైష్ణవులు

పెనుగొండ: రెండవ శ్రీరంగంగా పేరుగాంచిన కొఠాలపర్రులోని కేశవ స్వామి ఆలయంలో ఆదివారం అండమాన్, రాజమహేంద్ర వరం నుంచి వచ్చిన భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. స్థానాచార్యులు ముదుంబై రామానుజాచార్యులు, ఆలయ అర్చకులు ఎస్ వెంకటాచార్యులు ఆధ్వర్యంలో కేశవ స్వామికి నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మరంగంటి కృష్ణమాచార్యులు, గొడవర్తి వెంకట మురళీ, ముదుంబై నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ


ఉచిత ధ్యాన శిక్షణ ఇస్తున్న రామారావు

వీరవాసరం: వీరవాసరంలో శ్రీసీతారామ స్వామి దేవస్థానం ప్రాంగణంలో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ ఆదివారం నిర్వహించారు. విజయవాడకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎస్.రామారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలని, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలని, ధ్యానం సర్వరోగ నివారణి, ధ్యానం సర్వభోగకారిణి, ధ్యానం సత్య జ్ఞానప్రసాదిని అన్నారు. ప్రతిఒక్కరూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, ఎం.కృష్ణారావు సన్నిధి ఉదయ్, కె.మోహన్, వర్రె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నరసాపురం

- సీఎండీఎఫ్ నిధులు రూ.1.35 కోట్లతో వేగంగా అభివృద్ధి పనులు
- అంజుమన్ భవనానికి కొత్త రూపు


పంజా సెంటర్‌లో అభివృద్ధి చేసిన అంజుమన్ భవనం

నరసాపురం: నరసాపురం పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నారు. పట్టణంలోలో వివిధ కమ్యూనిటీ భవనాలు, మంచినీటి పథకాలకు సీఎండీఫ్ (చీఫ్‌మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్స్) నుంచి రూ.1.35 కోట్లు నిధులు మే నెలలో ప్రభుత్వం మంజూరు చేసింది.. దీనికి సంబంధించి జీఓఎంఎస్ 106, 70ను ప్రభుత్వం ఇచ్చింది. ఈ నిధులతో పనులు వేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలో ముస్లిం మైనార్టీకి చెందిన అంజుమన్ భవనం అభివృద్ధికి రూ 25 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో భవనం మొదటి, రెండవ అంతస్తులను అభివృద్ధి చేస్తున్నారు. గత ఏడాది నవంబర్ 21న నరసాపురంలో రూ.3,300 కోట్ల భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురం వచ్చినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విఫ్ ముదునూరి ప్రసాదరాజు పలు అభివృద్ధి పనులకు నిధులు కావాలని సీఎంను కోరడంతో పాటుగా ప్రతిపాదనలు అందించారు.. దీంతో ఆయన ఆ పనులకు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుంచి సొమ్ము మంజూరు చేశారు.

నిధుల కేటాయింపు ఇలా

- 16 వార్డులో రూ.25 లక్షలతో అంజుమన్ భవనం పైఅంతస్తు అభివృద్ధి
- 8వ వార్డులో బీసీ కమ్యూనిటీహాల్ అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయింపు
- మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో అసంపూర్తిగా ఉన్న ఓహెచ్ఆర్ నిర్మాణాలకు రూ.20 లక్షల కేటాయింపు
- నరసాపురం పట్టణం 14వ వార్డులో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.39 లక్షల కేటాయింపు
- వైఎన్ఎం కాలేజ్ పీజీ బ్లాక్ అభివృద్ధికి రూ.12 లక్షలు
- కొత్తనవరసపురంలో ఎస్టీలకు సంబంధించి మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ 5 లక్షలు.
- పాతనవరసపురం, కొత్తనవరసపురం, మల్లవరం, మల్లవరం లంక గ్రామాల్లో ఎస్సీలకు సంబంధించి మంచినీటి పైప్‌లైన్స్ అభివృద్ధి కోసం

ముదునూరికి ప్రత్యేక కృతజ్ఞతలు



అంజుమన్ భవనం అభివృద్ధికి రూ 25 లక్షలు సీఎండీఎఫ్ ఫండ్స్ కేటాయించడం గొప్ప విషయం. పనులు ప్రారంభమయ్యాయి. మొన్నటి వరకూ పనులు కాస్త మందకొడిగా సాగాయి. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకు మా ముస్లింల అందరి తరపునా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ముఖ్యమంత్రికి కూడా ధన్యవాదాలు. ఈ నిధులతో మా అంజుమన్ భవనాన్ని మరింత సుందరంగా ఆధునికీరించుకుంటున్నాం.

– షేక్ బులిమస్తాన్, అంజుమన్ సంఘం అధ్యక్షుడు

సీడబ్ల్యూఎస్ స్కీమ్స్‌లో రూ 18.లక్షలు నిధుల మంజూరు

అంజుమన్ భవనానికి కొత్తరూపు

ముఖ్యంగా ముస్లిం మైనార్టీలకు చెందిన అంజుమన్ భవనానికి కొత్తరూపు రాబోతుంది.ఈ భవనం రెండవ అంతస్తు అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేయడంతో మైనార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గత రంజాన్‌కు ప్రార్థనల్లో పాల్గొనడానికి వెళ్లిన చీఫ్‌విఫ్ ముదునూరి ప్రసాదరాజుకు అంజుమన్ భవనం అభివృద్ధికి సహకారం అందించాలని ముస్లిం సంఘపెద్దలు విజ్ఞప్తిచేశారు. దీంతో ప్రసాదరాజు ప్రత్యేక శ్రద్ధపెట్టి ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న ముస్లింలు పంక్షన్స్ ఈ భవనంలోనే చేసుకుంటారు.

18న సీతారాంపురంసౌత్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష


సీతారామపురంసౌత్‌లో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారాంపుర సౌత్ గ్రామంలో ఈ నెల 18న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ శారారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తామన్నారు. దీనిలో భాగంగా క్యాంపు నిర్వహణకు 20 రోజులు ముందు నుంచి సచివాలయ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి బీపీ, సుగర్, హెచ్‌బీ, యూరిన్, కళ్లె పరీక్ష తదితర 7 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. 18న నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పి.దుర్గ, హెల్త్ అసిస్టెంట్ చింతపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


పోడూరు ఎస్సై డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు

పోడూరు: తనపై ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టులు పెట్టి తన ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా, కుల విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కుట్రలు పన్నుతున్న టీడీపీ కోవర్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన పార్టీ నాయకులతో కలసి ఆదివారం ఆయన స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదును అందజేశారు. ఈ నెల 7న పాలకొల్లు పట్టణానికి చెందిన టీడీపీ కోవర్టు బుంగ తిరుమలరాజు తాను దళితులను దూషించినట్లుగా లేనిపోని అపనిందలతో ఫేస్‌బుక్ పోస్టు పెట్టినట్లు పెద్దిరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే జిన్నూరు గ్రామానికి చెందిన గిలిగి గోపాలకృష్ణ, పాలమూరుకు చెందిన బుంగ పవన్‌లు తిరుమల రాజుకు సహకరించి తనను కించపర్చి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేవిధంగా కుట్రపన్నుతున్నారని పెద్దిరాజు ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. వారు ముగ్గురుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కఠినంగా శిక్షించాలి..

పోడూరు జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేత అయిన గుంటూరి పెద్దిరాజుపై లేనిపోని అపనిందలతో ఫేస్‌బుక్ పోస్టులు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టాలను కుట్రలు పన్నుతున్న టీడీపీ కోవర్టులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న పోలీసులను డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు పెద్దిరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన అనంతరం నాగన్న మాట్లాడుతూ పోడూరు మండలంతో పాటు ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో జెడ్పీటీసీ పెద్దిరాజు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి కలిదిండి గణపతిరాజు, జేసీఎస్ కన్వీనర్లు బళ్ల రాజశేఖర్, పైడి ఏసుబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరరావు, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, జిన్నూరు, పెనుమదం సొసైటీ చైర్మన్‌లు డీటీడీసీ బాబు, కొ్రపాటి వీరాస్వామి, దిద్దే శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చుట్టుగుల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

నీతిని బోధించే సినిమాలు కరువయ్యాయి


సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: సమాజానికి నీతిని బోధించే సినిమాలు కరువయ్యాయని ప్రముఖ సినీ దర్శకుడు సి ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన కదలిక ప్రగతిశీల ఆలోచనల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. 1930లో వచ్చిన సినిమాలు మాలపిల్ల, రైతు బిడ్డ సినిమాలు సమాజానికి మంచి సందేశాన్ని అందించాయన్నారు. ప్రస్తుత సినిమా రంగం వ్యాపార ధోరణితో చిత్రీకరిస్తున్నారే తప్ప సమాజానికి మంచి బోధించే అంశాలు ప్రస్తుత సినిమాల్లో ఉండడం లేదన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సినిమా రంగాన్ని శాసిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి, కదలిక వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, సీపీఎం సీనియర్ నాయకుడు వలవల శ్రీరామమూర్తి, డా.కేఎస్‌పీఎన్ వర్మ, లయన్స్‌క్లబ్ మహిళా అధ్యక్షురాలు అరుణానాయుడు, ఏకేవీ రామభద్రం, రామలక్ష్మణరావు, మాడభూషి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పెనుగొండలో నిమజ్జనోత్సవాల సందడి


పెనుగొండలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఆకట్టుకున్న వేషధారణలు

పెనుగొండ: ప్రతీ ఏటా పెనుగొండ కంబాల వారి వీధి, జవ్వాదివారి వీధిల్లో నిర్వహించే భారీ స్థాయి గణపతినిమజ్జనోత్సవం ఆదివారం కనుల పండుగగా నిర్వహించారు. కంబాల వారి వీధిలోనూ, జవ్వాదివారి వీధిలోనూ, వినాయకుని ఆలయం వద్ద గణపతి ప్రతిమలను ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యద్భుతంగా ఏర్పాటు చేసిన ఎలుక వాహనంపై ఉంచి నిమజ్జనోత్సవం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేరళావాయిద్యాలు, డీజే వాయిద్యం, ఫుల్ బ్యాండులతో హోరెత్తించారు. ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి, పెనుగొండ, చెరుకువాడల్లో బాణసంచాకాల్పులతో ఉత్రూతలూగించారు. అనంతరం నరసాపురం కాలువలో నిమజ్జనం నిర్వహించారు. ఆదివారం కావడంతో పరిసర గ్రామాల నుంచి ఉత్సవాన్ని తిలకించడానికి భారీగా ప్రజలు తరలివచ్చారు.

ఆధునిక విజ్ఞానం సర్కారు బడి సొంతం

- బోధనలో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త పంథా
- శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు


దొడ్డిపట్ల హైస్కూల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)పై బొమ్మల ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కొత్త పుంతలు తొక్కుతుంది. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రభుత్వ పాఠశాలలన్నీ విజ్ఞాన కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ప్రభుత్వం హైస్కూళ్లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) ద్వారాను, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని కలగజేస్తుంది. ప్రపంచాన్ని తరగతి గదిలోనికి తీసుకురావడమే ఐఎఫ్‌పీ ప్రత్యేకత. దీని ద్వారా బొమ్మలు, ప్రదేశాలను చూపుతూ సమగ్రమైన విద్యాబోధన చేస్తారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలను, అన్ని విషయాలను చూపిస్తూ విద్యార్థులకు బోధన చేస్తున్నారు. సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో బొమ్మల ద్వారా బోధన ఉంటుంది. లెక్కలు, తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌కు సంబంధించి ఐఎఫ్‌పీ బోర్డుపై ఉదాహరణలతో చూపిస్తారు. దీని వల్ల విద్యార్థుల్లో నూతన ఉత్తేజం కలుగుతుంది. పాఠ్యాంశాలపై ఆసక్తి, సమగ్ర అవగాహన కలుగుతుంది. ఉదాహరణకు సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి వివరించాలంటే ఐఎఫ్‌పీలో క్లిక్ చేస్తే ఆయన బొమ్మ ప్రత్యక్షమవుతుంది. ఉపాధ్యాయులు దానిని చూపిస్తూ బోధించడం వలన విద్యార్థులకు పూర్తి అవగాహన వస్తుంది.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

ఆధునిక శాస్త్ర విజ్ఞానం అందుబాటులోనికి వచ్చిన తరువాత పిల్లల్లో గ్రాహక శక్తి బాగా పెరిగింది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ చేతికి ఇస్తే కాని ఆహారం తీసుకోని స్థితికి పిల్లలు వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పలకలపై విద్యాబోధనకు పిల్లలు సిద్ధంగా లేరు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ట్యాబ్ విద్యా విధానం అమలవుతున్నా ప్రభుత్వ పాఠశాలలు ఆ స్థితికి రాలేదు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ విధానం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు తీసుకురావడానికి ఉపయుక్తమవుతున్నాయి.


దొడ్డిపట్లలో స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

విద్యారంగంలో సమూల మార్పులు

గత నాలుగున్నరేళ్లలో విద్యారంగంలో వచ్చిన మార్పులను గమనిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యత అవగతమవుతుంది. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారాయి. మధ్యాహ్న భోజన పథకం మెనూలో సమూల మార్పు చేసి జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల సమగ్ర ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందిస్తున్నారు. అదనంగా బెల్లపు రాగి అందిస్తూ ఆరోగ్యకరమైన యువతను సమాజానికి అందించే ప్రయత్నం చేస్తున్నారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, టైలు, బూట్లు, సాక్సులు ఇలా విద్యార్థులకు అన్ని వసతులు ఉచితంగా సమకూరుస్తూ అన్ని వర్గాల విద్యార్థులకు సమన్యాయం చేస్తున్నారు. గతంలో హాస్టల్స్‌లో చదువుకునే ఎస్సీ, బీసీ విద్యార్థులకు మాత్రమే ఇటువంటి సౌకర్యాలు అందేవి. ఇప్పుడు ఆ తేడా లేకుండా చేయడం విశేషం. అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతి పథకాల ద్వారా విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్నారు. పాఠశాలల్లోనే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుంది జగనన్న ప్రభుత్వం. ఈ విధంగా గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ విద్యా విధానంలో వచ్చిన మార్పులు చరిత్రలో ఒక రికార్డనే చెప్పాలి.

విద్యార్థుల ఉన్నతికి శ్రీకారం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు విశేష ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రభుత్వ విద్యారంగంలో సమూలమార్పులు వచ్చాయి. ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల వినియోగం వలన విద్యార్థులు మెరికల్లా తయారవుతారు. దీని వల్ల భవిష్యత్‌లో ఉద్యోగాల సాధించే సమయంలో నగరాల్లో చదువుకునే కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉంటారు.

– కనుమూరి వెంకట రామకృష్ణంరాజు, ఎంఈఓ–2, యలమంచిలి

సంగీత ధ్యానంతో మానసికోల్లాసం


సంగీత, నాద స్వర వాయిద్యాన్ని వినిపిస్తున్న పిప్పళ్ళ ప్రసాదరావు

ఆకివీడు: మనస్సు ప్రశాంతంగా ఉంటే మంచి ఆరోగ్యం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సైన్సు అకాడమి కో–చైర్మన్ డాక్టర్ పీబీ ప్రతాప్ కుమార్ అన్నారు. స్థానిక పతంజలి యోగారోగ్య కేంద్రంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సంగీత నాద ధ్యానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. మరో ముఖ్యఅతిథి వానపల్లి బాబూరావు మాట్లాడుతూ ధ్యానం, యోగ వంటి సాధనాలు మన పూర్వీకులు మనకు అప్పగించారన్నారు. గత కొన్నేళ్లుగా పతంజలి, పిరమిడ్ కేంద్రాలు ప్రజల్లో మళ్లీ యోగా, ధ్యానం వంటివాటిపై శిక్షణ ఇవ్వడం అదృష్టమన్నారు. గాన తుంబర, ధ్యానరత్న పిప్పళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ సంగీతం వింటేనే మనస్సు ఉత్తేజభరితమవుతుందన్నారు. అటువంటి సంగీతంతో కలిపి ధ్యానం చేయడం మనస్సుకు మరింత ఉల్లాసాన్ని అందిస్తుందన్నారు. ధ్యానరత్న ఉండ్రమట్ల సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ధ్యానంపై ఆసక్తి చూపితే ఆ కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. స్థానిక ధ్యాన గురువు ఉండ్రమట్ల కనకదుర్గ సభకు హాజరైనవారందరికీ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పలువురు యోగా గురువులు, ధ్యాన గురువులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండ


అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉండి ఇంటి నిర్మాణానికి సహాయం అందజేస్తానని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీనిచ్చారు. బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువులో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో యాతం రాంబాబు, యాతం నరసింహారావులకు చెందిన తాటాకిళ్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. బాధితులను ఆదివారం గోపి పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధితులకు బియ్యం అందజేశారు. బాధితులకు ఇళ్ల స్థలం మంజూరు చేయించి, ఇల్లు కూడా ఇస్తామని చెప్పారు. ఇంటి నిర్మాణానికి తన వంతు సహాయంగా చెరో రూ.20 వేలు ఇస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బాధితులు గోపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు వైఎస్సార్ సీపీ నాయకులు బోనం బులివెంకన్న, దేవరపు మల్లేశ్వరరావు, పెంటపాటి సూకరాజు, కడలి ఏడుకొండలు, ఆకుల సూర్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస్, చెరుకూరి శ్రీరామమూర్తి, మామిడిశెట్టి చిన్నిబాబు, గోనిపాటి బాబూరావు, దొమ్మేటి శ్రీను, యాతం వెంకటేశ్వరరావు తహసీల్దార్ మాతా సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలు

పాలకొల్లు అర్బన్: ఉత్సవాలు యువజనుల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పట్టణంలోని అల్లు వెంకట సత్యనారాయణ కాలనీలో ఉన్న న్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి నవ రాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనను గుడాల గోపి ప్రారంభించి మాట్లాడారు. అలాగే ఆలయంలో లడ్డుపాట నిర్వహించగా రూ.28 వేలుకి వైఎస్సార్ సీపీ నాయకుడు మండెల ప్రసాద్ పాడుకున్నారు. ఉత్సవ కమిటీ టి.దుర్గాప్రసాద్, కందుల పాటి మోహన చలపతిరావు, ఎస్ సత్యనారాయణ (బాబి), వైఎస్సార్ సీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, కాండ్రేకుల రాజేశ్వరి, జోగి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రామకృష్ణ, జోగాడ ఉమామహేశ్వరరావు, కొండేటి రవి తదితరులు పాల్గొన్నారు.